క్లుప్తంగా

మరమ్మతులకు గురైన స్వచ్ఛ వాహనాలు



ఆలత్తూరులో నిరుపయోగంగా ఆటో

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ప్రతి పంచాయతీలో చెత్తను సేకరించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ పథకంలో భాగంగా ఆటోలు, మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేసింది. వీటితో పాటు ప్రతి ఇంటిలోని తడి, పొడి చెత్తను సేకరించడానికి గ్రీన్ అంబాసిడర్లను నియమించింది. గ్రీన్ అంబాసిడర్లు ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను ఆటోలు, సైకిళ్ల ద్వారా చెత్త కేంద్రాలకు తరలించేవారు. ఈ క్రమంలో ఆటోలు, సైకిళ్లు మరమ్మతులకు గురయ్యాయి. వీటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో తుప్పుపడుతున్నాయి. దీంతో చెత్తను తరలించడానికి గ్రీన్ అంబాసిడర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన సంబంధితశాఖ అధికారులు స్పందించి స్వచ్ఛ ఆటోలు, సైకిళ్లకు మరమ్మతులు చేపట్టాలని గ్రీన్ అంబాసిడర్లు కోరుతున్నారు.

బాలుకు ఐకాన్ అవార్డు



కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి : పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు, కవి, రచయిత, మిమిక్రీ కళాకారుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యంకు అంతర్జాల వేదిక, దరఖాస్తు ఆధారంగా బహుముఖ ప్రజ్ఞను అభినందిస్తూ ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్స్ నిర్వాహకులు ఇంటర్నేషనల్ ఐకాన్ అవార్డు, ప్రశంసాపత్రాన్ని ఇంటర్‌నెట్ ద్వారా పంపించారు. వినూత్న కళాత్మక బోధన, సాహిత్యం సేవలకు గాను ఈ అవార్డును అందిస్తున్నట్లు బాలు తెలిపారు. ఆయనకు అవార్డు రావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు సరుకుల పంపిణీ



విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న సంఘం సభ్యులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని నగరవీధిలోని హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి యువతరం సేవాసమితి సభ్యులు యువకిషోర్ హాజరై పంపిణీ చేశారు. 156 నెలలుగా ఇలా పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని తమ సంస్థ కూడా సేవా కార్యక్రమాలు విస్తృతం చేశామన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పేదలకు సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ నిర్వాహకులు మునీర్‌బాషా, సభ్యులు గరికపాటి రమేష్ బాబు, రాజేశ్వరరావు, బాబా ఫరీద్, డిల్లీకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గుంతలు పూడ్చివేత



రేణిగుంట ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గుంతలు పూడ్చి వేయిస్తున్న సర్పంచ్

రేణిగుంట : పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీద ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను సర్పంచ్ నగేశం ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది పూడ్చారు. గుంతలు ఏర్పడి వాహన చోదకులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందికరంగా మారింది. దీంతో స్పందించిన ఆయన గుంతలకు సిమెంట్ ప్లాస్టింగ్ వేయించి పూడ్చారు.

కావమ్మకు విశేష అభిషేకాలు



కావమ్మకు అభిషేకాలు చేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి : పట్టణంలో బుధవారం ఏడు గంగమ్మల జాతర జరగనుంది. ఆదివారం చాటింపు సందర్భంగా పట్టణంలోని పూసల వీధి మూడవ గంగమ్మ కావమ్మ అమ్మవారి తెట్టురాయికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వరరావు పవార్, జనార్దన్‌రావు పవార్, శివాజీ, నరేంద్ర, సుకుమార్, జలగం ముని, శ్రీనివాసులు, భరత్, గోవింద్, వినోద్ పాల్గొన్నారు.



పాల్గొన్న పట్టణ ప్రముఖులు

అటు ఆనందం.. ఇటు ఆక్రందన

సత్యవేడు నియోజకవర్గంలోని గంగ కాలువ దిగువ ప్రాంతాల్లో నీటి వసతి ఉండడంతో రైతులు ఉత్సాహంగా వరి సాగులో నిమగ్నం అయ్యారు. మరోవైపు కాలువ ఎగువ ప్రాంతంలోని చెరువుల్లో నీరు లేక .. పంటల సాగుకు సరిపడా నీరు లభ్యంకాక కాడి ముందుకు సాగక చెరువు ఆయకట్టు రైతులు దిగాలు పడుతున్నారు. ఇలా ఒకే ప్రాంతంలో విభిన్న పరిస్థితులు నెలకొనడంతో అన్నదాతలు ఒక వైపు ఆనందంలో ఉండగా.. మరో వైపు ఆక్రందన చెందుతున్నారు.

- తూర్పు వైపు జోరుగా వ్యవసాయం
- పడమర వైపు కదలని కాడి
- విభిన్న పరిస్థితులపై రైతుల సంకటం

గంగ కాలువ ఊటతో కలుజు పారుతున్న కాళమనాయుడుపేట చెరువు



సత్యవేడు: మండల పరిధిలో 3,888 మంది రైతులు ఉండగా అందులో కౌలు రైతులు 37 మంది వరకు ఉన్నారు. వరి సాగు 286 హెక్టార్లు, వేరుసెనగ 26 హెక్టార్లు, సజ్జ 224 హెక్టార్లలో సాగువుతోంది. ఇక కాలువ ఎగువ ప్రాంతంలోని చెరువుల్లో పంట సాగుకు సరిపడినంత నీరు చేరకపోవడంతో చెరువు ఆయకట్టు రైతులు దిగాలు పడుతున్నారు. కాలువ దిగువ ప్రాంతాలైన కొత్తమారి కుప్పం, కాళమనాయుడుపేట , మదనంజేరి, అంబాకం, నరసరాజు అగ్రహారం పంచాయతీల్లో జలకళ సంతరించుకోవడంతో చెరువు ఆయకట్టు వరి పంటతో పచ్చదనం సంతరించుకుంది. గంగ కాలువ ఎగువ ప్రాంతాలుగా ఉన్న రాజుల కండ్రిగ, మదనంబేడు, పుదుకుప్పం, కన్నావరం, గ్రామాల పరిధిలోని చెరువుల్లో అడుసు దున్నేందుకు నీరు సరిపోతుంది. పంట సాగు చేసినా నీరు సరిపోదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగ కాలువకు సమీపంలో ఉన్న మదనంబేడు , రాజుల కండ్రిగ గ్రామాల రైతులు రెండు చెరువులకు బిందుసేద్యం ద్వారా రైతాంగానికి నీటి సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



మదనంబేడు చెరువు ఇలా..



రాజుగుంట చెరువులో అరకొరగా నీరు



గంగ కాలువ కింద నరసరాజు అగ్రహారంలో పచ్చని పైరు

గంగనీటితో ఊరట



గంగ కాలువలో నీళ్లు ఉంటే గ్రామ పరిధిలో చెరువుకు ఊటనీరు చేరుతుంది. ఆ ఊట నీటితో చెరువులు కలుజులు పారుతున్నాయి. కలుజు పారితే పంటకు సరిపడే నీరు చెరువులో ఉంటుంది. ఆ ధైర్యంతో చెరువు ఆయకట్టు కింద వరిపైరు సాగు చేస్తున్నాం.

– గుణశేఖర్, కేవీఎస్‌పేట, సత్యవేడు మండలం

చెరువు తూముకు నీరు చేరలేదు



మదనంబేడు చెరువులో ప్రస్తుతం కురిసిన వర్షాలకు చెరువులో నీరు చేరలేదు. తూము వరకు కూడా నీరు రాకపోవడంతో వ్యవసాయ పనులు చేపట్టలేదు. కొందరు రైతులు బోరు, బావుల కింద కొద్దిగా వ్యవసాయం చేస్తున్నారు. చెరువుకు పూర్తి స్థాయిలో నీరు రాకపోవడంతో చెరువు ఆయకట్టు బీడుగా ఉంది.

– మనోహరుడు, మదనంబేడు, సత్యవేడు మండలం

ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించాలి



గంగ కాలువ సమీపంలో మదనంబేడు, రాజుగుంట చెరువులకు గంగ కాలువ నీటిని లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అందించారు. అటవీ ప్రాంతంలో అధికారులు పెద్ద పెద్ద గోతులు తీశారు. వర్షపు నీరు అందులో చేరి ఇంకిపోతోంది. కొండల్లో వర్షపు నీరు చెరువులకు చేరడం లేదు. ప్రభుత్వం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరందించి స్థానిక రైతులను ఆదుకోవాలి.

– మోహన్, వీఆర్ కండ్రిగ, సత్యవేడు మండలం

తుపాన్‌తో దెబ్బతిన్న ఉద్యాన పంటలు



కారణి గ్రామంలో దెబ్బతిన్న టమాట పంట

బుచ్చినాయుడుకండ్రిగ : ఫెంగల్ తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మిరప, టమోట, కాకర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కనమనంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ, గాజులపెళ్లూరు, ఆలత్తూరు, వేణుగోపాలపురం, కంచనపుత్తూరు గ్రామాల్లోని 60 ఎకరాలకు పైగా మామిడి తోటలు గాలీవానతో కొమ్మలు విరిగిపోయి దెబ్బతిన్నాయి. అదే విధంగా బుచ్చినాయుడుకండ్రిగ, ఆర్.అనంతపురం, పల్లమాల, పార్లపల్లి, కుక్కంబాకం గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో 50 ఎకరాలకు పైగా మిరప పంటకు నష్టం చేకూరింది. 10 ఏళ్లకు పైగా వయస్సున్న మామిడి చెట్ల కొమ్మలు విరిగిపోవటంతో రైతులు లబోదిబోమంటున్నారు. కాపు దశకు వచ్చిన మిరప పంట దెబ్బతినటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కారణి గ్రామానికి చెందిన సునీల్‌రెడ్డి సాగు చేసిన రెండెకరాల టమాట పంటలో నీరు చేరటంతో రూ.2 లక్షలు నష్టపోయారు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

నేడు లక్ష బిల్వార్చన

నాగలాపురం : మండలంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి పి.లత తెలిపారు. తమిళ కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు.

రెఫర్ల పర్వంపై అధికారుల సీరియస్

- ఆకస్మిక వీడియో కాల్‌తో హడలెత్తించిన కమిషనర్
- పరుగులు తీసిన నిర్లక్ష్యపు వైద్యులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సిబ్బంది నిర్లక్ష్యంపై అధికారులు సీరియస్‌గా స్పందించారు. ఆదివారం 'సాక్షి' దినపత్రికలో 'ప్రభుత్వాస్పత్రిలో రెఫర్ల పర్వం' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై మొదట కలెక్టర్ వెంకటేశ్వర్ సీరియస్‌గా స్పందించారు. ఏరియా ఆస్పత్రిలో ఒక ప్యాకెట్ రక్తం ఎందుకు నిల్వ లేకుండా నిర్లక్ష్యంగా వ్యహరించారని అధికారులను ఫోన్ ద్వారా కలెక్టర్ నిలదీశారు. అలాగే రక్తం లేదన్న సాకుతో రెఫర్ చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇద్దరు అనస్తీషియా డాక్టర్‌లు ఉన్నప్పటికీ ఎందుకు అత్యవసర ఆపరేషన్లు చేయకుండా రెఫర్లు చేస్తున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. ఒక అనస్తీషియా సాయంత్రం 4 గంటలు అయితే తిరుపతిలోని ఇంటికి వెళ్లిపోతున్నట్లుగా ఆ తరువాత మరుసటి ఉదయం వరకు ఉండనట్లుగా కలెక్టర్ విచారణలో గుర్తించారు. ఇదిలాఉండగా ఆసుపత్రి డాక్టర్ల తీరుపై కమిషనర్‌కు ఇప్పటికే అనేక ఫిర్యాదులు వెళ్లాయి. పట్టణానికి చెందిన ఓ వైద్యుడు ఆదివారం డ్యూటీ డాక్టర్‌గా ఆస్పత్రిలో ఉండాల్సి ఉంది. అయితే కమిషనర్ సిరి ఆకస్మికంగా విధుల్లో ఉన్న డాక్టర్‌కు వీడియో కాల్ చేశారు. ఆయన ఆ సమయంలో తన ప్రైవేటు క్లినిక్‌లో ఉండటంతో వీడియో కాల్‌తో హడలిపోయారు. కమిషనర్ వీడియోకాల్‌తో పరుగు పరుగున ఆస్పత్రికి చేరుకొని కమిషనర్‌కు వీడియో కాల్‌లో సమాధానం ఇచ్చినా సంతృప్తి చెందకపోవడంతో తాను విధుల్లోనే ఉన్నానంటూ ఓ స్టాఫ్ నర్సుతో కూడా మాట్లాడించి ఎట్టకేలకు ఈ సమస్య నుంచి బయటపడ్డారు. వైద్యుడు ఆస్పత్రికి పరుగులు తీయడంపై అక్కడ చూస్తున్న రోగులంతా హతాశులయ్యారు. ఎప్పుడైనా ఏ సమయంలోనైనా వైద్యులకు ఫోన్ చేస్తానని అందుబాటులో లేకుండా అనవసరంగా కేసులను రెఫర్ చేస్తే ఉపేక్షించేది లేదని కమిషనర్ సిరి హెచ్చరించినట్లు సమాచారం. కమిషనర్ వీడియోకాల్ సంభాషణను గమనించిన ఆస్పత్రిలోని రోగులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెత్తమయం.. వ్యాధుల భయం

శ్రీకాళహస్తి పట్టణంలోని నగరివీధిలో సదాశివ టవర్స్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో చెత్తా చెదారం, కొబ్బరి బోండాలు వేయడంతో అపరిశుభ్రత నెలకొంది. అసలే వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీరు నిల్వ చేరి దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. దీంతో అధికారులు స్పందించి అక్కడ నుంచి చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. శ్రీకాళహస్తి



అధికారుల చేష్టలు.. ప్రయాణికుల నిశ్చేష్ట



ఏపీ టూరిజం సమీపంలో సిమెంటు దిమ్మెల ఏర్పాటుతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి–తిరుపతి మధ్య ఆరులేన్ల రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి నుంచి ఏపీ టూరిజం దాటిన తరువాత హైవేలో ప్రవేశించకుండా సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేశారు. దీంతో శ్రీకాళహస్తి ఆలయం నుంచి వెళ్లే భక్తులకు అర్థం కాక సర్వీసు రోడ్డు నుంచి కిలోమీటరు ప్రయాణం చేసి హైవేలో చేరుకోవాల్సి వస్తోంది. ఆ రోడ్డు కూడా సరిగా లేకుండా పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఏపీ టూరిజం సమీపంలో హైవేలో ప్రవేశించే విధంగా సిమెంటు దిమ్మెలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

కర్టనే మరుగుదొడ్లకు తలుపు



తలుపు లేక కర్టన్ ఏర్పాటు చేసుకొన్న దృశ్యం వృత్తంలో

వరదయ్యపాళెం: మండలంలోని కారిపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తలుపులు లేని మరుగుదొడ్లతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద కారిపాకం పాఠశాలను అభివృద్ధి చేశారు. అందులో భాగంగా మరుగుదొడ్లు నిర్మించారు. ఇంతలో ఎన్నికలు రావడంతో నాడు-నేడు పనులు ఆగిపోయాయి. దీంతో మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి అయినప్పటికీ తలుపులు బిగించలేదు. 6 నెలలుగా మరుగుదొడ్లను వినియోగిస్తున్నారు. తలుపులు లేని కారణంగా బాలికలు కర్టన్ గుడ్డను అడ్డం వేసుకుని వాడుకోవాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వంలో కనీసం డోర్లు కూడా అమర్చలేని దుస్థితిలో ఉన్నారంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. 210 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో మరుగుదొడ్ల గురించి నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరుగుదొడ్లకు డోర్లు అమర్చాలని కోరుతున్నారు.

తిరుమల లడ్డూ కౌంటర్‌లో ఆకస్మిక తనిఖీ

తిరుమల: తిరుమలలోని లడ్డూ కౌంటర్‌లో టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా టోకెన్ల స్కానింగ్, లడ్డూల జారీ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. లడ్డూ రుచి, నాణ్యత పెరగడం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీటీడీ సీవీఎస్ఓ శ్రీధర్, డిప్యూటీ ఈఓ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గంగ జాతరకు పటిష్ట చర్యలు : డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి : గంగ జాతరకు పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నట్లు డీఎస్పీ నరసింహమూర్తి పేర్కొన్నారు. శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 10, 11న నిర్వహించే గంగ జాతరకు పటిష్ట భద్రత కల్పిస్తున్నామని అందుకు కావాల్సిన సిబ్బంది కోసం ఎస్పీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎస్పీ సహకారం, సూచనలతో ముందుకు వెళతామన్నారు. ఇప్పటికే గత గంగ జాతరలో తలెత్తిన వివాదాలను దృష్టిలో పెట్టుకుని పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. గంగ జాతర కోసం ఏర్పాటైన కమిటీలు బాధ్యత వహించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అందు కోసం ప్రతి గంగమ్మ కొలుపు దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఊరేగింపు సమయాల్లో అమ్మవారి దర్శన సమయంలో వీడియో కవరేజ్ చేసే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు కమిటీ వారు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా వీడియో తీస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయాలు, కులమతాలకు ప్రమేయం లేకుండా జాతర నిర్వహించాలని నినాదాలు, కేకలు, ఈలలు వేయడం వంటివి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించినా చర్యలు తీసుకుంటామన్నారు. డీజేలు పెట్టి బూతు పాటలు వేస్తే కుదరదని డీఎస్పీ హెచ్చరించారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే వెంటనే సమాచారం ఇస్తే సిబ్బంది వారిని అదుపులోకి తీసుకుని కేసులు పెడుతామన్నారు. గంగమ్మ జాతర కోసం కమిటీ మెంబర్లు అక్రమంగా వసూలు చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఊరేగింపులో మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించకూడదని హితవు పలికారు. అందరి సమన్వయంతో సమష్టిగా ఏడు గంగల జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు. పోలీసుల సూచనలు, హెచ్చరికలు పాటించి ప్రజలకు అమ్మవారి దర్శనం కలిపించాలని కోరారు. సమావేశంలో సీఐ గోపి, ఎస్ఐ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. సమస్యలకు నిలయాలు

సత్యవేడు నియోజకవర్గంలో గ్రంథాలయాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతోంది. రోజురోజుకు గ్రంథాలయాలు పాఠకులకు దూరమవుతున్నాయి. సొంత భవనాలు, అధికారులు లేక మూత పడుతున్నాయి. ప్రధానంగా ఉద్యోగుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ స్థాయిలో సైతం డిజిటల్ గ్రంథాలయాలను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో గ్రంథాలయాల నిర్వహణ పట్టించుకోవడం లేదు. వరదయ్యపాళెం



బీఎన్‌కండ్రిగలో మూతపడిన శాఖ గ్రంథాలయం

- దయనీయంగా లైబ్రరీల నిర్వహణ
- బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెంలో మూతపడిన వైనం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో 6 శాఖ గ్రంథాలయాలు గతంలో ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య నాలుగుకే పరిమితమైంది. ఈ నాలుగు గ్రంథాలయాలకు అధికారులు లేక ఇన్‌చార్జుల పాలనలో మొక్కుబడిగా సాగుతున్నాయి.

ఇన్‌చార్జ్ పాలనలో..

నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులో ఉన్న గ్రేడ్–2 శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి కరువయ్యారు. దీంతో నాగలాపురం గ్రంథాలయానికి చెందిన గ్రేడ్–3 గ్రంథాలయ అధికారి ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అలాగే నారాయణవనం గ్రంథాలయం ఇన్‌ఛార్జ్ అధికారి పర్యవేక్షణలో మొక్కుబడిగా సాగుతోంది.

మూతపడిన లైబ్రరీలు ఇలా..

వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ గ్రంథాలయాలు మూతపడ్డాయి. ఆరేళ్ల కిందట వరదయ్యపాళెం గ్రేడ్–3 శాఖ గ్రంథాలయం మూతపడగా, మూడేళ్ల కిందట బీఎన్‌కండ్రిగ గ్రేడ్–3 శాఖ గ్రంథాలయం మూతపడ్డాయి.

నామమాత్రపు వసతులతో కొనసాగుతున్న నాగలాపురం గ్రంథాలయం





వరదయ్యపాళెంలో నిర్మాణ దశలో నూతన శాఖ గ్రంథాలయ భవనం

నూతన భవన నిర్మాణం

మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో ఆరేళ్ల కిందట గ్రేడ్–3 శాఖ గ్రంథాలయం మూతపడింది. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శాఖ గ్రంథాలయానికి నూతన భవనానికి రూ. 25 లక్షలు మంజూరు చేసింది. పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణ పనులను ప్రారంభించి శ్లాబు దశకు పూర్తి చేశారు. పనులు ఇంకా పూర్తి కావాల్సి ఉంది.

నిధులున్నా నిర్లక్ష్యమేనా?

- పారిశుద్ధ్యలోపంతో అవస్థ

వరదయ్యపాళెం : మండల కేంద్రమైన వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్యం పడకేసింది. గోవర్ధనపురం కాలువగట్టు వీధిలో అడుగడుగునా మురుగునీటి నిల్వలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఆ ప్రాంతంలో వీధులు మురికి కూపంగా మారడంతో దోమలు విస్తరించి స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎటుచూసినా విష జ్వరాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అయితే గోవర్ధనపురంలోని వీధులు పూర్తిగా వర్షపునీరు, మురుగునీటి నిల్వలతో ఉన్నాయి. నిధులున్నా మేజర్ పంచాయతీలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ఏళ్లతరబడి కాలువగట్టు వీధి పూర్తిగా మురుగు నీటి నిల్వలు ఉన్నా పట్టించుకునే దిక్కు లేదు. అంతేకాక మురుగునీటి కాలువల్లో కూడా పేరుకుపోయిన మురుగు వ్యర్థాలతో నీరు ముందుకు కదలలేని పరిస్థితి. పూడికతీత పనులు అంతంత మాత్రమే జరుగుతున్నాయి. తక్షణమే పారిశుద్ధ్య పనులు నిర్వహించడంతో పాటు సిమెంటు రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగునీటిలో కొళాయి

గోవర్ధనపురం కాలువగట్టు వీధిలో తాగునీటి కొళాయి మురుగు నీటిలో ఉండిపోయింది. కొళాయి ఏర్పాటు చేసిన ప్రాంతంలో పేరుకుపోయిన పాచి మురుగునీటి మధ్య ఉండడం ఆందోళన కలిగిస్తోంది.



వరదయ్యపాళెంలోని గోవర్ధనపురంలో మురుగు కూపంలో కాలువగట్టు వీధి



కాలువగట్టు వీధిలో చెత్తకుప్పలో తాగునీటి కొళాయి